
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సిద్దిపేట 5
మంగళవారం 4 మార్చి 2025



రంజాన్ వేళలు
మంగళవారం ఇఫ్తార్: సాయంత్రం 6.29
బుధవారం సహర్: ఉదయం 5.10



కాంగ్రెస్‌లో గ్రూపుల లొల్లి

- సంగారెడ్డి, మెదక్ మినహా అంతటా ఇదే పరిస్థితి
- అధికారంలోకి వచ్చినా మారని తీరు
- పటాన్‌చెరు, గజ్వేల్‌లో రచ్చకెక్కిన విభేదాలు
- సిద్దిపేట, నర్సాపూర్, దుబ్బాకలో ఎవరికివారే...
- నామినేటెడ్ పోస్టులు, స్థానిక ఎన్నికలపై అస్పష్టత
- గందరగోళంలో కార్యకర్తలు
- నేడు మెదక్ పార్లమెంటు నేతలతో పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి మీనాక్షి సమీక్ష

హస్తవ్యస్తం

మెతుకుసీమ కాంగ్రెస్ పార్టీలో అంతర్గత కుమ్ములాటలు పెరుగుతున్నాయి. కొత్త.. పాత, సీనియర్లు.. జూనియర్లు అనే విభేదాలతో హస్తం పార్టీ అస్తవ్యస్తంగా తయారవుతోంది. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తరువాత పరిస్థితి మరింత జటిలమైంది. కుమ్ములాటల కారణంగానే ఎంపీ ఎన్నికల్లో పార్టీకి ఓటమి ఎదురైందని.. ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ లోటుపాట్లు తలెత్తాయని కార్యకర్తలు వాపోతున్నారు. స్థానిక ఎన్నికల్లోనూ నష్టం జరగొచ్చనే ఆందోళన వారిలో నెలకొన్నది. నామినేటెడ్ పదవులు ఆశిస్తున్నవారికి ఎదురుచూపులు తప్పడం లేదు. ఈ కారణాల దృష్ట్యా నేడు మెదక్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్ల ముఖ్య నేతలతో కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ సమీక్ష నిర్వహించనున్నారు.

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, మార్చి 3: మెదక్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో కాంగ్రెస్ పార్టీకి ఆపసోపాలు తప్పడం లేదు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో మెదక్ నియోజకవర్గాన్ని హస్తగతం చేసుకోవడం మినహాయిస్తే ఆ తర్వాత ఆశించిన ఫలితాలు కనిపించలేదు. 7 అసెంబ్లీ సెగ్మెంట్లలో ఆరు చోట్ల బీఆర్ఎస్ ఎమ్మెల్యేలే గెలిచారు. మిగితా చోట్ల నియోజకవర్గ ఇన్‌చార్జులు ఉన్నప్పటికీ సంగారెడ్డి మినహాయిస్తే ఇతర నియోజకవర్గాల్లో అంతర్గత విభేదాలు తారాస్థాయికి చేరాయి.

పటాన్‌చెరులో మూడు ముక్కలు

పటాన్‌చెరు నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ మూడు ముక్కలైంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాటా శ్రీనివాస్‌గౌడ్ ఎమ్మెల్యేగా పోటీచేసి ఓడిపోయారు. ఆయన నియోజకవర్గ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. ఇక కాంగ్రెస్ టికెట్ ఆశించి భంగపడి బీఎస్పీ నుండి పోటీచేసిన నీలం మధు తిరిగి కాంగ్రెస్‌లోనే చేరారు. ఎంపీగా పోటీచేసి ఓటమిపాలయ్యారు. ఈ ఇద్దరికీ పొసగక వేర్వేరు గ్రూపులు తయారయ్యాయి. తర్వాత బీఆర్ఎస్ నుంచి గెలిచిన గూడెం మహిపాల్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరడంతో మూడో గ్రూపు ప్రారంభమైంది. ముగ్గురి నడుమ అంతర్గత కుమ్ములాటలు, విభేధాలు ఉన్నాయి. ప్రధానంగా కాటా శ్రీనివాస్ గౌడ్, మహిపాల్‌రెడ్డి వర్గాల పంచాయతీ పలుమార్లు గాంధీభవన్‌కు చేరింది. ముగ్గురి నడుమ దశాబ్దాల కాలంగా పార్టీని నమ్ముకున్న కార్యకర్తలంతా తీవ్ర నైరాశ్యంలో ఉన్నారు.

గజ్వేల్, సిద్దిపేటలోనూ గ్రూపులు

గజ్వేల్ నియోజకవర్గంలో పార్టీ ఇన్‌చార్జి నర్సారెడ్డి వైఖరిపై ఆ పార్టీ నేతలే అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. ఆయనకు వ్యతిరేకంగా గ్రూపులు కడుతున్నారు. పార్టీ ప్రయోజనాల కంటే సొంత ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇస్తున్నారని బాహాటంగా విమర్శిస్తున్నారు. కొన్ని రోజుల క్రితం గజ్వేల్ పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలోనే కాంగ్రెస్‌లోని గ్రూపు రాజకీయాలు బట్టబయలయ్యాయి. ఒకరిపై మరొకరు దాడులు చేసుకునేదాకా వెళ్లారు. మరో కాంగ్రెస్ నేత బండారు శ్రీకాంత్‌రావు వర్గానికి, నర్సారెడ్డి వర్గానికి పొసగడం లేదు. దీనికితోడు డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి సైతం సొంతంగా గ్రూపును తయారు చేసుకుంటున్న పరిస్థితి నెలకొంది. ఇక సిద్దిపేట నియోజకవర్గంలో గడిచిన 40 ఏళ్ల నుంచి కాంగ్రెస్ గెలిచింది లేదు. కానీ అసెంబ్లీ ఎన్నికల సమయంలో టికెట్ ఆశించేవారి సంఖ్య పదుల్లో ఉంటుంది. ఏళ్ల తరబడిగా పార్టీలో కష్టపడుతున్నవారితోపాటు గత ఎన్నికల సమయంలో కొత్తగా కొందరు పార్టీలో చేరారు. దీంతో పదవుల కోసం, స్థానిక ఎన్నికల్లో సీట్ల కోసం గ్రూపులు కట్టారు. రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డి, మంత్రులు, పార్టీ ముఖ్యనేతల పేరు చెప్పుకుంటూ ఇక్కడ గ్రూపులు తయారయ్యాయి.

దుబ్బాక, నర్సాపూర్‌లోనూ ఇదే పరిస్థితి

దుబ్బాక నియోజకవర్గంలో కాంగ్రెస్ ఇన్‌చార్జిగా చెరుకు శ్రీనివాస్‌రెడ్డి, సీనియర్ నేతలు శ్రావణ్‌కుమార్‌రెడ్డి, మద్దుల సోమేశ్వర్‌రెడ్డి గ్రూపులు ఉన్నాయి. రాష్ట్రంలోని చాలా నియోజకవర్గాల్లో నామినేటెడ్ పదవుల భర్తీ జరుగుతుండగా దుబ్బాకలో ఆ పరిస్థితి లేకపోయింది. పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నా మార్కెట్ కమిటీలు, ఆత్మ కమిటీలను భర్తీ చేయలేదు. కూడవెల్లి రామలింగేశ్వర స్వామి పాలకమండలి నియామకం వివాదాస్పదంగా మారింది. ఈ విషయంలో ఇన్‌చార్జి శ్రీనివాస్‌రెడ్డి సరిగ్గా వ్యవహరించలేదనే అభిప్రాయాలు నెలకొన్నాయి. నర్సాపూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ నేతలంతా కలిసి ఉన్నామన్నట్లుగానే కనిపిస్తున్నా ఎవరికివారు ఆధిపత్యం ప్రదర్శిస్తున్నారని చెప్పుకుంటున్నారు. నియోజకవర్గంలో ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి ముఖ్యనేతలుగా ఉన్నారు. గ్రూపుల ప్రభావంతో క్షేత్రస్థాయిలో కార్యకర్తలు అయోమయానికి గురవుతున్నారు.

పంటలు ఎండుతున్నాయ్

- తక్షణమే నీటిని విడుదల చేయాలి
- ఆంకంపేట, సీతారాంపల్లి గ్రామాల రైతుల రాస్తారోకో



ముస్తాబాద్-సిద్దిపేట రోడ్డుపై రాస్తారోకో చేస్తున్న ఆంకంపేట, సీతారాంపల్లి రైతులు

సిద్దిపేటరూరల్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): సాగునీరు లేక పంటలు ఎండిపోతున్నాయ్.. నీళ్లు విడుదల చేయాలని ఇరిగేషన్ అధికారులను వేడుకున్నా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తూ సిద్దిపేట రూరల్ మండలం ఆంకంపేట, సీతారాంపల్లి గ్రామాల రైతులు సోమవారం ముస్తాబాద్-సిద్దిపేట రోడ్డుపై మూడు గంటల పాటు రాస్తారోకో చేపట్టారు. ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యమే రైతుల పాలిట శాపంగా మారిందని, అధికారులు వచ్చే వరకు రాస్తారోకో విరమించేది లేదని భీష్మించు కూర్చున్నారు. ఈ సందర్భంగా ఇరు గ్రామాల రైతులు మాట్లాడుతూ.. మల్లన్నసాగర్ ప్రాజెక్టు నుంచి ఆంకంపేట చెరువులోకి నీళ్లు వదలకపోవడంతో వందల ఎకరాల్లో పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆంకంపేట చెరువులోకి మల్లన్నసాగర్ నీళ్లు వస్తే ఆంకంపేట, సీతారాంపల్లి గ్రామాలతో పాటు మరిన్ని గ్రామాల రైతులకు మేలు చేకూరుతుందని తెలిపారు. ఇరిగేషన్ అధికారులు వచ్చి నీళ్లు ఆంకంపేట చెరువులోకి నీటిని వదలాలంటూ పురుగుల మందు డబ్బాతో రాస్తారోకో చేశారు. అధికారులు నీళ్లు ఇస్తారో.. లేక పురుగుల మందు తాగి చావడమో ఏదో ఒకటి జరగాలని, పంటలు ఎండిపోయాక రైతు బతుకు ఎందుకు అని ఆవేదన వ్యక్తం చేశారు. రాస్తారోకో చేస్తున్న సీతారాంపల్లి రైతు ఎండవేడికి తట్టుకోలేక సొమ్మసిల్లి పడిపోవడంతో స్థానిక వైద్యుడితో చికిత్స అందించారు. రాస్తారోకో విషయం తెలుసుకున్న సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను, ఎస్ఐ అపూర్వరెడ్డి సంఘటనా స్థలానికి వచ్చి రైతులకు సర్ది చెప్పి ఆందోళన విరమింపజేశారు. ఇరిగేషన్ అధికారులు మాత్రం రైతులు వద్దకు వచ్చి నచ్చజెప్పే ప్రయత్నం చేయకపోవడం గమనార్హం..!



ఫైల్

అంగన్‌వాడీ కొలువులపై ఆశలు

- జిల్లాలో 86 టీచర్లు, 287 ఆయాలు పోస్టుల భర్తీకి కసరత్తు
- త్వరలో నోటిఫికేషన్
- మారిన విద్యార్హత నిబంధన
- నిరుద్యోగ మహిళల్లో చిగురిస్తున్న ఆశలు

సిద్దిపేట కలెక్టరేట్, మార్చి3(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాలను మరింత బలోపేతం చేసేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. పిల్లలకు ఇంగ్లిష్ మీడియం విద్యను అందించడం, యూనిఫామ్స్, కేంద్రాల్లో మౌలిక సదుపాయాల కల్పన తదితర అభివృద్ధి పనులు చేపడుతున్నారు. తాజాగా రాష్ట్ర గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క అంగన్‌వాడీ కేంద్రాల్లోని ఖాళీలను భర్తీ చేసేందుకు ఫైల్ పైన సంతకం చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో జిల్లాలోని నిరుద్యోగ మహిళల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

ఇంటర్ పాసైతేనే...

జిల్లా వ్యాప్తంగా ఐదు ప్రాజెక్టులో 1150 అంగన్‌వాడీ కేంద్రాలు నిర్వహిస్తున్నారు. వాటిలో 86 టీచర్, 287 ఆయాల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే ఖాళీగా ఉన్న టీచర్ల పోస్టుల్లో అర్హులైన ఆయాలకు పదోన్నతులు కల్పించిన తర్వాతే కలెక్టర్ ఆదేశాల మేరకు రోస్టర్ ప్రకారం నియామకాలు చేయనున్నారు. ఇంతకాలం పలు కారణాలతో ఖాళీగా ఉన్న టీచర్లు, ఆయాల పోస్టులను భర్తీ చేయలేదు. కొన్నేళ్లుగా వాటి నిర్వహణకు కూడా ఇబ్బందిగా మారింది. మరికొన్ని చోట్ల కొందరు టీచర్లకు అదనపు కేంద్రాలను అప్పగించగా విధులు నిర్వర్తిస్తున్నారు. అంగన్‌వాడీ టీచర్ పోస్టుకు గతంలో పదో తరగతి ఉత్తీర్ణత కావాలన్న నిబంధన ఉండేది. కేంద్రం జారీచేసిన నూతన మార్గదర్శకాల ప్రకారం అంగన్‌వాడీ టీచర్‌తో పాటు ఆయా పోస్టుకు కనీసం ఇంటర్ పాసై ఉండాలని నిబంధన ఉంది. ఇదే విషయంపై జిల్లా సం క్షేమాధికారి లక్ష్మీకాంతరెడ్డిని 'ఆంధ్రజ్యోతి' వివరణ అడగగా... జిల్లాలో టీచర్లు, ఆయాల ఖాళీలు ఉన్నాయో గుర్తించి నివేదికను సిద్ధం చేశామని, కలెక్టర్ ఆధ్వర్యంలో రోస్టర్ ప్రకారం ఎంపికలు చేసేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

వరి రైతులపై మొగి పిడుగు

- జిల్లావ్యాప్తంగా తెగుళ్ల సమస్యలు
- సల్ఫైడ్ ఉధృతికి గురైన వరి
- అవగాహన కల్పించడంలో అధికార యంత్రాంగం విఫలం
- ఆందోళనలో రైతన్నలు.. దిగుబడులపై ప్రభావం



వరిలో మొగిపురుగు

గజ్వేల్, మార్చి 3: వరి రైతులపై మొగిపురుగు పిడుగు పడింది. మొగి పురుగు ఉధృతితో వరి వేసిన రైతన్నలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. జిల్లావ్యాప్తంగా ఈ సమస్య పీడిస్తున్నా.. రైతులకు అవగాహన కల్పించడంలో అధికారులు విఫలమవుతున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా భారీ నీటిపారుదల రిజర్వాయర్లు అందుబాటులోకి రావడంతో రైతాంగం అంతా వరి పంట వైపే ఆసక్తి కనబరుస్తున్నారు. ఏటేటా వరి సాగు విస్తీర్ణం పెరుగుతూనే ఉంది. ఈ యేడు జిల్లాలో 3.28లక్షల ఎకరాల్లో వరి సాగయ్యింది. భారీగా సాగవ్వడం, పంట తెగుళ్ల బారిన పడుతుండడంతో అక్కడక్కడా అధికారులు పర్యటిస్తున్నా కేవలం ఫొటోలకే పరిమితమవుతున్నారన్న ఆరోపణలు లేకపోలేదు. రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించకపోవడంతో రైతులు విచ్చలవిడిగా ఎరువులు, ఇతర మందులను పిచికారి చేస్తున్నారు. అయితే, మొగిపురుగు ప్రభావం కారణంగా ఈ యేడు భారీగా పంటల దిగుబడి తగ్గే అవకాశాలు కనిపిస్తున్నాయి. పెట్టుబడి పెరిగి దిగుబడులు తగ్గే అవకాశాలు ఉండడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు.

పెరుగుతున్న వరి సాగు

జిల్లాలో ఏటేటా వరి సాగు విస్తీర్ణం పెరుగుతోంది. ఆయా రిజర్వాయర్లు, కాలువలు అందుబాటులోకి రావడంతో రైతులు వరిపంట సాగుపైనే ఆసక్తిని కనబరుస్తున్నారు. 2020 యాసంగిలో 2,83,285 ఎకరాల్లో వరిపంటను సాగు చేస్తే 2021లో 2,43, 614 ఎకరాల్లో, 2022లో 3,38,158 ఎకరాల్లో, 2023 లో 3,48,009ఎకరాల్లో, 2024లో 3,40,352 ఎకరాల్లో వరి సాగయ్యింది. ఈ ఏడాది 3.28లక్షల ఎకరాల్లో వరి సాగు చేసినట్లు వ్యవసాయాధికారులు అంచనా వేశారు.

పంటలకు తీవ్ర నష్టం

వానాకాలం, యాసంగిలో ఒకే పంటను సాగు చేయడం, ఏళ్లుగా పంట మార్పిడి చేపట్టకపోవడంతో వరిలో మొగిపురుగు దుష్ప్రభావానికి గురవుతున్నది. దీంతో పంట దిగుబడి 30 నుంచి 50 శాతం వరకు నష్టం కలగనుంది. అధిక నీటి ముంపు, తగిన రీతిలో పంట వేర్లకు గాలి అందకపోవడం సైతం ఈ పురుగు బారిన పడ్డాయి. ముఖ్యంగా సాగునీటి పారుదల, చెరువుల కింద గల భూముల్లో ఈ లోపం తలెత్తుతుంది. వరిలో మధ్యకాలంలో అక్కడక్కడ గుంపులుగుంపులుగా పసుపువర్ణంలో మారి ఎదుగుదల క్షీణిస్తుంది. వరి కుళ్లిన వాసన రావడం, బుడగల రూపంలో గాలి బయటకు రావడం జరుగుతాయి. వేర్లు కుళ్లిన వాసన వస్తాయి. జిల్లా వ్యాప్తంగా భారీగా వరిపంటను వేయడంతో మొగిపురుగు తన ఉగ్రరూపాన్ని చూపిస్తుంది. దీంతో దిగుబడులు భారీ స్థాయిలో పడిపోయే అవకాశాలున్నాయి. ఉష్ణోగ్రతలు ఇటీవల పడిపోవడం, నత్రజని తక్కువగా వాడటంతో కాండం బలహీనపడి మొగిపురుగు ఆశిస్తుంది. యాసంగిలో ప్రతి ఏటా రైతులను మొగి పురుగు ఇబ్బంది పెడుతున్నా వ్యవసాయాధికారులు అవగాహన కల్పించలేకపోతున్నారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

వరికి సస్యరక్షణ చర్యలు చేపట్టాలని అధికారులు సూచిస్తున్నారు. వరిపంటలో మొగిపురుగు ఉధృతిని గమనిస్తే క్లోరాంత్రానిలిప్రోల్ మందును 0.3మిల్లిలీటర్లు లీటర్ నీటికి కలిపి ఎకరాకు 200లీటర్ల ద్రావణాన్ని లేదా 4జీ కార్టాప్ హైడ్రోక్లోరైడ్ గుళికలను ఎకరాకు ఆరు

మిగతా 8వ పేజీలో



గజ్వేల్ మండల పరిధిలోని బయ్యారంలో మొగిపురుగు వల్ల ఎర్రబడిన వరిపంట





తాగునీటి కోసం తప్పని తిప్పలు

అక్బర్‌పేట-భూంపల్లి మండలం రుద్రారంలో తాగునీటికోసం తిప్పలు తప్పడం లేదు. గ్రామంలోని 1, 2, 11, 12 వార్డుల్లో మిషన్‌భగీరథ నీరు రాకపోవడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఖాళీ బిందెలను పట్టుకుని, గ్రామంలో బోరుబావులవద్దకు, ట్యాంకుల వద్దకు వెళ్లి నీటిని తెచ్చుకుంటున్నారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల గ్రామంలో నీటిఎద్దడి నెలకొందని గ్రామస్థులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి గ్రామంలోని నీటిసమస్యను తీర్చాలని కోరుతున్నారు. సమస్య ఇలాగే కొనసాగితే ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామని హెచ్చరిస్తున్నారు.

- మిరుదొడ్డి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి)

ఇంటర్ పరీక్షలకు పటిష్ట బందోబస్తు

- సీపీ అనురాధ

సిద్దిపేట కల్చరల్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఈనెల 5 నుంచి జరిగే ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేస్తున్నట్లు సీపీ అనురాధ తెలిపారు. జిల్లాలోని 43 పరీక్ష కేంద్రాల వద్ద 163 బీఎన్ఎస్ఎస్ సెక్షన్ అమలులో ఉంటుందని చెప్పారు. ఈ నెల 5 నుంచి 25 వరకు ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు ఆంక్షలు అమలులో ఉంటాయని పేర్కొన్నారు. పరీక్షలు జరిగే సమయంలో సమీపంలో ఉన్న అన్ని జీరాక్స్ సెంటర్లను మూసేయాలని, 500 మీటర్ల వరకు ప్రజలు గుమిగూడ వద్దన్నారు. పోలీస్‌స్టేషన్ నుంచి పరీక్షాపత్రం ఎగ్జామ్ సెంటర్‌కు వెళ్లే సమయంలో తప్పనిసరిగా ఎస్కార్ట్ ఉండాలన్నారు. ఇక విద్యార్థులు పరీక్ష సమయానికే గంట ముందే కేంద్రానికి చేరుకోవాలని, మానసికంగా ఎటువంటి ఆందోళన చెందకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని కమిషనర్ సూచించారు.

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర

- అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్

సిద్దిపేట కలెక్టరేట్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో రైతులకు మద్దతు ధర ఉంటుందని, రైతులు అక్కడే పంటను అమ్ముకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ పేర్కొన్నారు. సోమవారం సిద్దిపేటలోని వ్యవసాయ మార్కెట్‌లో పొద్దుతిరుగుడు కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ... యాసంగి సీజన్‌లో జిల్లాలో 11,193 ఎకరాల్లో సన్‌ఫ్లవర్ సాగు జరిగిందని, అంచనా ఉత్పత్తి 7436.32 మెట్రిక్ టన్నులు కాగా, సగటు దిగుబడి 6.64 క్వింటాళ్లు ఎకరానికి వస్తుందని తెలిపారు. ప్రస్తుత సీజన్‌లో సిద్దిపేట, హుస్నాబాద్, బెజ్జంకి, గజ్వేల్, తొగుట, చిన్నకోడూరు, అక్కన్నపేట మండలాల్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రైతులు తమ సన్‌ఫ్లవర్ పంటను ధర రూ.7282 మద్దతు ధర ఉందని, ప్రామాణిక నాణ్యత, ప్రమాణాలు పాటిస్తూ, ప్రభుత్వ కొనుగోలు కేం ద్రాలను వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమం లో మార్క్‌ఫెడ్ డీఎం క్రాంతి, జిల్లా మార్కెటింగ్ అధికారి నాగరాజు, జిల్లా సహకార అధికారి నాగమణి, వ్యవసాయ మార్కెట్ కమి టీ సెక్రటరీ వెంకటయ్య, ఏఎంసీ అకౌంటెంట్ సురేష్, రైతులు తదితరులు పాల్గొన్నారు.



పొద్దుతిరుగుడు కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్

బీజేపీ వెల్దుర్తి మండల ఉపాధ్యక్షుడిగా బాలకిషన్

వెల్దుర్తి, మార్చి3(ఆంధ్రజ్యోతి) : బీజేపీ వెల్దుర్తి మండల ఉపాధ్యక్షుడిగా బాలకిషన్ నియమితులయ్యారు. సోమవారం వెల్దుర్తిలో పార్టీ మండల అధ్యక్షుడు దాసు ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికలో ఆయనను ఏకగ్రీవంగా ఎనుకున్నారు. అనంతరం బాలకిషన్ మాట్లాడుతూ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానన్నారు. నాయకులు శేఖర్‌గౌడ్, వెంకటేష్, శ్రీనివాస్, శివరాములు తదితరులు ఉన్నారు.

మండుటెండల్లో మత్తళ్లు

సిద్దిపేట జిల్లాలోని చెరువులు మండుటెండల్లో మత్తళ్లు పోస్తున్నాయి. రంగనాయక సాగర్ నుంచి నీటిని విడుదల చేయడంతో ఎడమ కాల్వ ద్వారా పారుతున్న నీటితో చెరువులు, చెక్ డ్యామ్‌లు నిండి పరవళ్లు తొక్కుతున్నాయి. దీంతో రైతులు వ్యవసాయ పనులు ముమ్మరం చేస్తున్నారు. నర్సాపూర్ చెరువు అలుగు పోస్తుండటంతో ఎండవేడికి చిన్నా పెద్ద స్నానాలు చేస్తున్నారు. - స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సిద్దిపేట


అలుగు పారుతున్న నర్సాపూర్ చెరువు


పూర్తిగా నిండిన పెద్దకోడూర్ చెరువు


మత్తడి దూంకుతున్న మండపల్లి చెక్‌డ్యామ్

క్రైం కార్నర్

ఇరవై రోజుల్లో పెళ్లి.. అనుమానాస్పదంగా మృతి


సునీల్ (ఫైల్)

నాగల్‌గిద్ద, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఇరవై రోజుల్లో పెళ్లి పీటలు ఎక్కాల్సిన యువకుడు అనుమానాస్పదస్థితిలో మృతి మృతి చెందాడు. మండలంలోని గంగారం తండాకు చెందిన చౌహాన్ విఠల్ మూడో కుమారుడు సునీల్(20) హైదరాబాద్‌లో పానీపూరి బండి నడుపుతూ అక్కడే ఉంటున్నాడు. అతనికి 15 రోజుల క్రితం ఓ యువతితో నిశ్చితార్థం జరిగింది. ఈ నెల 26న పెళ్లి చేయాలని పెద్దలు నిర్ణయించారు. గత శుక్రవారం రాత్రి సునీల్ తన సోదరుడైన అనిల్‌కు ఫోన్ చేసి పచ్చకామెర్ల మందు కోసం శనివారం పిట్లం వెళ్తున్నానని.. మందు తీసుకుని ఇంటికి వస్తానని చెప్పాడు. మనూరు మండలం పుల్‌కుర్తి చెరువులో సునీల్ చనిపోయి ఉన్నాడని సోమవారం కుటుంబ సభ్యులకు సమాచారం అందింది. దీంతో వారు వెళ్లి చూడగా, చెరువులో శవమై కనిపించాడు. 20 రోజుల్లో పెళ్లి జరగాల్సిన కుమారుడి మరణంపై అనుమానం ఉందని కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మల్లంపేటలో మరొకరు..

పాపన్నపేట, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మల్లంపేటకు చెందిన గంగన్నోల్ల రత్నయ్య (55) అనుమానాస్పదంగా మృతి చెందాడు. ఎస్‌ఐ శ్రీనివాస్ గౌడ్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన రత్నయ్య కూలీ పనులు చేస్తాడు. ఆదివారం రాత్రి ఇంట్లో భోజనం చేసి, అదే గ్రామంలో తన కుమార్తె ఇంటి వద్ద ఎవరు లేకపోవడంతో అక్కడ నిద్ర పోయేందుకు వెళ్లాడు. సోమవారం ఉదయం ఇంటి తలుపులు తెరిచి ఉండడంతో స్థానికులు చూడగా రత్నయ్య ఇంట్లో ఉరి వేసుకుని వేలాడుతూ కనిపించాడు. తన తండ్రి మృతిపై అనుమానం ఉందని కుమార్తె ఉషా ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చెరువులో మునిగి వ్యక్తి మృతి


సాయికుమార్(ఫైల్)

శివ్వంపేట, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లిన వ్యక్తి నీట మునిగి చనిపోయాడు. ఈ ఘటన మండలంలోని బిజిలిపూర్ గ్రామంలో సోమవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన సాయికుమార్ ఈ నెల 1న రాత్రి చేపలు పట్టేందుకు వెళ్తున్నానని చెప్పి, వెళ్లాడు. ఎంతకీ తిరిగి రాకపోవడంతో చుట్టుపక్కల వెతికారు. సోమవారం స్థానిక వీరప్ప పెద్ద చెరువు వద్ద చూడగా, శవమై కనిపించాడు. మద్యం మత్తులో చెరువు వద్దకు వెళ్లి అందులో పడి చనిపోయి ఉంటాడని సోదరి శైలజ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై మధుకర్‌రెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అప్పుల బాధతో ఆత్మహత్య

మనోహరాబాద్ మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి ఆత్మహత్య సోమవారం ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై సుభాష్‌గౌడ్ కథనం ప్రకారం.. మండలంలోని లింగారెడ్డిపేట్ గ్రామానికి చెందిన పిట్ల రాజు(44) కూలీ పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. కొన్ని రోజుల క్రితం కొత్త ఇల్లు కట్టాడు. పెద్ద కుమార్తె పెళ్లి చేయాలనే ప్రయత్నాల్లో ఉన్నాడు. అయితే, ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న రాజు కొన్ని రోజులుగా మనస్థాపంతో బాధపడేవాడు. సోమవారం ఇంట్లో నుంచి వెళ్లి గ్రామ శివారులోని ఓ పొలంలో చెట్టుకు ఉరి వేసుకున్నాడు. రైతులు చూసి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. రాజుకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

స్నేహితుడి అన్న పెళ్లికి వచ్చి వెళ్తూ..

బైక్‌పై నుంచి పడి యువకుడి దుర్మరణం


సాయినిఖిల్(ఫైల్)

నర్సాపూర్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): స్నేహితుడి అన్న పెళ్లికి వచ్చి.. తిరుగు ప్రయాణం అవుతున్న ఇద్దరు స్నేహితుల బైక్ అదుపుతప్పి బోల్తా పడటంతో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాల పాలైన ఘటన నర్సాపూర్ సమీపంలో జాతీయ రహదారిపై అయ్యప్ప ఆలయం సమీపంలో చోటు చేసుకుంది. ఎస్సై లింగం కథనం ప్రకారం.. హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి శాంతినగర్‌కు చెందిన సాయినిఖిల్(21), మరో స్నేహితుడు మనీష్‌లు బైక్‌పై ఆదివారం ఉదయం మెదక్‌లో తమ స్నేహితుడి అన్న పెళ్లికి హాజరై రాత్రి తిరుగుప్రయాణం అయ్యారు. రాత్రి 11 గంటల ప్రాంతంలో అతివేగంగా వస్తూ అయ్యప్ప ఆలయం మూలమలుపు వద్ద వారి బైక్ అదుపు తప్పి పల్టీ కొట్టింది. దీంతో సాయినిఖిల్ అక్కడికక్కడే మృతి చెందగా, మనీష్‌కు తీవ్రగాయాలు అయ్యాయి. అతడిని మొదట నర్సాపూర్ ఆస్పత్రికి అక్కడి నుంచి సంగారెడ్డి ఆస్పత్రికి తరలించారు. సాయినిఖిల్ మృతదేహానికి నర్సాపూర్ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్న సాయినిఖిల్ తండ్రి రవి ఉపాధి కోసం దుబాయ్‌లో ఉన్నాడు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు..

కొండపాక, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తిని మోటార్ సైకిల్ ఢీ కొట్టడంతో తీవ్రగాయాలైన వ్యక్తి ఆస్పత్రిలో సోమవారం మృతి చెందాడు. కుకునూరుపల్లి ఎస్సై శ్రీనివాస్ కథనం ప్రకారం.. మండలంలోని మంగోల్ గ్రామానికి చెందిన తోడేటి పెంటయ్య(60) మెదినీపూర్‌లో బంధువుల వివాహానికి వెళ్లాడు. ఆదివారం రాత్రి అక్కడి నుంచి నడుచుకుంటూ కొండపాకలోని బంధువుల ఇంటికి వెళ్తుండగా, హైదరాబాద్ వైపు నుంచి వస్తున్న మోటార్‌సైకిల్ ఢీకొని తీవ్రగాయాలు అయ్యాయి. 108 అంబులెన్స్‌లో సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, అక్కడి ననుంచి ఆర్‌వీఎం ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ సోమవారం మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఫోన్ కోసం భార్యాభర్త గొడవ

ఇంట్లో నుంచి వెళ్లిపోయిన ఇల్లాలు


ఎంబరి పవిత్ర

శివ్వంపేట, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఫోన్ కోసం భర్తతో గొడవపడి భార్య ఇంట్లో నుంచి వెళ్లిన ఘటన సోమవారం మండల పరిధిలోని తిమ్మాపూర్ గ్రామంలో వెలుగుచూసింది. గ్రామానికి చెందిన గొల్ల నాగరాజు, కొల్చారం మండలం కిష్టాపూర్‌కు చెందిన ఎంబరి పవిత్ర (19)కి ఏడు నెలల క్రితం వివాహం జరిగింది. ఇటీవల తల్లి గారింటికి వెళ్లిన పవిత్ర ఇంటి నుంచి ఫోన్ తెచ్చుకుంది. ఫోన్ నేను ఇప్పిస్తా.. ఇంటి నుంచి ఎందుకు తెచ్చుకున్నావని ఆదివారం భర్త మందలించాడు. ఈ విషయంలో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. భర్త సోమవారం ఉదయం పనికివెళ్లి, మధ్యాహ్నం వచ్చాడు. భార్య కనిపించకపోవడంతో ఇంట్లో ఉన్న తల్లిని అడిగాడు. తాను రెండు గంటలకు పడుకున్నానని ఎటువెళ్లిందో తెలియదని చెప్పింది. చూడ గా, ఫోన్ ఇంట్లో ఉంది. చుట్టుపక్కల వెతికినా ఆచూకీ దొరకకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్సై మధుకర్‌రెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బడ్‌చిప్.. బహుబాగు

- చెరకులో నారు నాటే పద్ధతి
- తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి
- అవగాహన కల్పిస్తున్న డీడీఎస్- కేవీకే

జహీరాబాద్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): జహీరాబాద్ ప్రాంతంలో చెరకు సాగు విస్తీర్ణం పెరుగుతోంది. ఇక్కడ ఎర్ర, గరుకు నేలలు ఉండటంతో ఎక్కువ మంది చెరకు సాగు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. మారుతున్న పరిస్థితుల నేపథ్యంలో వ్యవసాయంలో నూతన సాంకేతిక చోటు చేసుకుంటుండగా ఇక్కడి చెరకు రైతులు ఇంకా సంప్రదాయ పద్ధతిలోనే సాగు చేస్తున్నారు. దీంతో వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు చెరకుసాగులో అధునాతన పద్ధతుల వైపు రైతులను మళ్లించేందుకు తమ వంతు ప్రయత్నాలు చేస్తున్నారు. బడ్‌చిప్ విధానంలో సాగు చేస్తే నాణ్యమైన అధిక దిగుబడి సాధించవచ్చునని చెబుతున్నారు.


బడ్‌చిప్ విధానంలో పాలిహౌస్‌లో చెరకు నారు

విత్తన శుద్ధి ఇలా..

చెరకు విత్తనం తీసుకువచ్చిన తర్వాత కూలీలు లేదా యంత్రాల ద్వారా గడలకు ఉన్న కన్నులు (ముచ్చులు) తొలగించాలి. అలా తొలగించిన కన్నులను ఒక దగ్గర పోగు చేసి, ట్రేలలో ఏర్పాటు చేసిన గడుల్లో కోకోపీట్, సేంద్రియ ఎరువులతో నింపి అందులో చెరకు కన్నులు వేయాలి. నారుమడుల తరహాలో సుమారు 25 నుంచి 30 రోజుల వరకు పాలీ హౌజ్‌లను ఏర్పాటు చేసి పెంచాలి. పెరిగిన చెరకు నారును మొక్కకు.. మొక్కకు మధ్య 20 నుంచి 30 సెంటీమీటర్ల దూరంలో ఉండేలా జంట సాళ్ల పద్ధతిలో నాటుకోవాలి. జంట సాళ్ల మధ్య సుమారు 75 నుంచి 80 సెంటీమీటర్ల దూరం ఉండేలా చూసుకోవాలి. ఇలా చెరకు నాటడం వల్ల మొక్క బలంగా ఉండటంతో పాటు పిలకలు ఎక్కువగా వస్తాయి. ఇలా సాగు చేస్తే ఎకరాకు 40 టన్నుల నుంచి 50 టన్నుల వరకు దిగుబడి వచ్చే అవకాశం ఉంది.

23 వేల ఎకరాల్లో..

జహీరాబాద్ ప్రాంతంలో వాణిజ్య పంటలతో పాటు ప్రధాన పంటగా చెరకును సాగు చేస్తున్నారు. నియోజకవర్గంలో సుమారు 23 వేల ఎకరాల్లో చెరకు సాగు అవుతుండగా, కొత్త పద్ధతులు, వంగడాలను ఎంచుకుని సాగు చేస్తే అధిక దిగుబడి, లాభాలు పొందవచ్చునని అధికారులు, శాస్త్రవేత్తలు చెబుతున్నారు. అయితే, పంట తీసే సమయంలో కూలీల కొరత, క్రషింగ్ కోసం సకాలంలో పర్మిట్లు దొరకకపోవడం, ఈ ప్రాంతంలోని ట్రైడెంట్ చక్కెర కర్మాగారం మూతపడటంతో పండిన పంటను కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాలకు తరలించడం వంటి సమస్యలను ఎదుర్కొంటున్నారు.

ఎకరాకు రూ. 55వేల ఖర్చు

అన్ని రకాల వాతారణాలకు తట్టుకుని పండే పంట కావడం, దిగుబడి అటు ఇటు అయినా గిట్టుబాటు అవుతుండటంతో రైతులు చెరకు సాగు చేస్తున్నారు. చెరకు సాగులో రైతులు చెరకు గడలను ముక్కలుగా నరికి, పొలాల్లో వేసిన కాలువల్లో వేసి నీటిని వదులుతూ భూమిలోకి తొక్కుతారు. ఈ విధానంలో ఎకరాకు సుమారు 6 టన్నుల చెరకు విత్తనం కావాల్సి ఉంటుంది. టన్ను ఒక్కంటికీ సుమారు రూ. మూడు వేల పైచిలుకు పలుకుతుండగా, ఎకరం చెరకు విత్తనానికి రూ. 20 వేలు, మందులు, ఇతర ఖర్చులు కలిపి ఎకరం సాగుకు రూ. 35 వేల వరకు ఖర్చు అవుతుంది. పంట చేతికి వచ్చే వరకు ఎకరాకు రూ. 55 వేల నుంచి రూ. 60 వేల వరకు ఖర్చు అవుతుందని రైతులు చెబుతున్నారు. ఎకరా పంట దిగుబడి 30 టన్నుల నుంచి 40 టన్నుల వరకు వస్తుంది.

ఎకరాకు టన్ను విత్తనమే..

బడ్ చిప్ విధానంతో చెరకు సాగు చేస్తే మరిన్ని లాభాలు వస్తాయని అధికారులు చెబుతున్నారు. ఈ విధానంలో చెరకు గడల కన్నులు తొలగించి పాలిహౌస్‌లో నారుగా వేసి, మొక్కలను నాటాల్సి ఉంటుందని వివరిస్తున్నారు. ఈ విధానంలో ఎకరాకు టన్ను చెరకు విత్తనం సరిపోతుందని, అందులో వంద కిలోల కన్నులు(ముచ్చులు) పోగా, మిగితా 900 కిలోల చెరకును బెల్లం తయారీ, పాల వ్యాపారులకు విక్రయిస్తే కొంత ఖర్చు తగ్గుతుంది. టన్ను చెరకు విత్తనం రూ. 3 వేలకు పైగా ఉండగా, మందులు, ఇతర సాగు ఖర్చులు కలిపి ఎకరాకు రూ. 35 వేల వరకు ఖర్చు అవుతుంది. బడ్ చిప్ సాగులో టన్నుకు సుమారు 8 వేల మొక్కలు వస్తాయని, ఎకరాలో చెరకు నాటేందుకు 7,500 మొక్కలు సరిపోతాయి.


చెరకు గడ కన్నులను వేరు చేసే యంత్రం


పంటను పరిశీలిస్తున్న అధికారులు, శాస్త్రవేత్తలు

అవగాహన కల్పిస్తున్నాం..



రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పిస్తున్నాం. చెరకులో బడ్‌చిప్ విధానంలో సాగు చేయాలని సూచిస్తున్నాం. ఈ విధానంలో తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆదాయం పొందవచ్చు. కేవీకే ఆధ్వర్యంలో ఏటా కొన్ని గ్రామాలను ఎంపికచేసి రైతుల ఆసక్తి మేరకు చెరకునారును అందజేస్తున్నాం. రెండేళ్లుగా డీడీఎస్- కేవీకేలో పాలీ హౌస్‌లను ఏర్పాటు చేసి చెరకు నారు పెంచుతున్నాం. ఈ ఏడాది పది మంది రైతులకు చెరకు నారు అందజేయనున్నాం.

-రమేష్, డీడీఎస్-కేవీకే శాస్త్రవేత్త

బాలికపై అత్యాచారం..

నిందితుడికి జీవితఖైదు


నిందితుడు మీర్జాఅక్బర్

రామచంద్రాపురం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): బాలికపై అత్యాచారానికి పాల్పడిన నిందితుడికి జీవిత ఖైదు విధిస్తూ సంగారెడ్డి జిల్లా సెషన్స్ కోర్టు జడ్జి కే.జయంతి సోమవారం తీర్పు చెప్పారు. తీర్పు వివరాలను కొల్లూరు పోలీసులు వెల్లడించారు. కొల్లూరు డబుల్‌బెడ్‌రూంలో నివాసం ఉండే మీర్జాఅక్బర్‌బేగ్ (44) 2004లో అదే కాలనీలో నివాసం ఉండే ఓ బాలికకు మాయమాటలు చెప్పి అత్యాచారానికి ఒడిగట్టాడు. జరిగిన దారుణాన్ని ఆమె తల్లిదండ్రులు గమనించి కొల్లూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేశారు. కేసు కేసు పూర్వపరాలు, సాక్షులు, సాంకేతిక ఆధారాలను పరిశీలించిన తరువాత న్యాయమూర్తి నిందితుడికి జీవితఖైదు, రూ.5వేల జరిమానా విధిస్తూ తుది తీర్పు వెలువరించారు. కేసును సమర్థవంతంగా దర్యాప్తు చేసి, కోర్టుకు ఆదారాలను సమర్పించి నిందితుడికి శిక్ష పడటంలో కొల్లూరు ఇన్స్‌పెక్టర్ రవీందర్, ఎస్సై బి. రవీందర్‌రెడ్డి, కానిస్టేబుళ్లు నర్సింలు, సమన్‌లను అధికారులు ప్రశంసించారు.

ముగిసిన కోటి రుద్రాక్షల శివలింగోత్సవం


శివలింగానికి హారతి పడుతున్న మహేశ్వర శర్మ సిద్ధాంతి


మల్లికార్జునస్వామిని దర్శించుకున్న ఎంపీ ఈటల రాజేందర్

సంగారెడ్డి రూరల్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని సంగారెడ్డి మండలం ఫసల్‌వాది శ్రీ జ్యోతిర్వాస్తు విద్యాపీఠం ఆశ్రమంలో ఏర్పాటు చేసిన 1.08 కోటి రుద్రాక్షల శివలింగోత్సవం సోమవారం ముగిసింది. ఆశ్రమ వ్యవస్థాపక అధ్యక్షులు మహేశ్వర శర్మ సిద్ధాంతి పర్యవేక్షణలో జరిగిన ఈ వేడుకల్లో సోమవారం 360 మంది భక్తులు సౌందర్యలహరి, శివానందలహరి పారాయణం చేశారు. వారం రోజుల పాటు జరిగిన ఈ వేడుకల్లో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి సుమారు 4 లక్షల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

మల్లికార్జున స్వామిని దర్శించుకున్న ఈటల

ములుగు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా ములుగు మండలం బండమైలారం గ్రామంలో మల్లికార్జునస్వామి ఉత్సవాలకు సోమవారం మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ హాజరయ్యారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సదర్భంగా ఆయన మాట్లాడుతూ స్వామివారి ఆశీస్సులు అందరిపై ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. ఆయన వెంట బీజేపీ ములుగు మండల అధ్యక్షులు మన్నె శ్రీనివాస్, నాయకులు ఉన్నారు.

రిజర్వు ఫారెస్ట్‌లో చనిపోయిన కోళ్లు

గుట్టుగా తెచ్చి డంప్ చేస్తున్న కొందరు

పుల్‌కల్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): చౌటకూర్ మండలం బొమ్మారెడ్డిగూడెం రిజర్వు ఫారెస్ట్‌లో కోళ్ల వ్యర్థాలను పారబోస్తున్నారు. కోళ్ల వ్యర్థాలను రిజర్వు ఫారెస్ట్‌లో బహిరంగ ప్రదేశాల్లో పారబోస్తుండటంతో తీవ్ర దుర్గంధం వ్యాపిస్తోంది. పుల్కల్, చౌటకూర్, అందోలు మండలాల్లోని ఆయా గ్రామాల శివారు ప్రాంతాల్లో రైతులు కోళ్ల ఫామ్‌లను నిర్వహిస్తున్నారు. కొన్ని రోజులుగా అంతుచిక్కని వ్యాధితో వేలాది కోళ్లు చనిపోతున్నాయి. వాటిని రాత్రి వేళల్లో గుట్టుచప్పుడు కాకుండా ట్రాక్టర్లలో బొమ్మారెడ్డిగూడెం రిజర్వు ఫారెస్ట్‌లోకి తీసుకువచ్చి ఇష్టానుసారంగా పారబోస్తుండటంతో గ్రామస్తులు తీవ్ర భయాందోళన చెందుతున్నారు. దుర్గంధం భరించలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


రిజర్వు ఫారెస్ట్‌లో పడేసిన చనిపోయిన కోళ్లు

అడవిలో మంటలు


మంటలు ఆర్పుతున్న అటవీ శాఖ సిబ్బంది

కొండపాక, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఖమ్మంపల్లి అటవీ ప్రాంతంలో సోమవారం మంటలు లేచాయి. వందలాది ఎకరాలకు మంటలు వ్యాపించి అంటుకున్నాయి. మంటల్లో ప్రైవేటు వ్యక్తుల చెందిన భూముల్లో పంటలు దగ్ధమయ్యాయి. మామిడి తోటలకు తీవ్రనష్టం వాటిల్లింది. వల్లంగల్ల రాములు అనే రైతు ట్రాక్టర్ కాలిపోయింది. మంటలు గ్రామం వైపుకు చెలరేగడంతో గ్రామస్థులు తీవ్ర భయాందోళన గురయ్యారు. వెంటనే ఫారెస్ట్ అధికారులకు, పోలీసులకు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో ఫైర్ ఇంజన్ చేరుకొని సిబ్బంది మంటలను ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో అడవిలో పలు చెట్లు కాలి పోయాయి.

బార్ అండ్ రెస్టారెంట్‌లో అగ్నిప్రమాదం

చేర్యాల, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): చేర్యాల పట్టణంలోని ప్రవీణ్ బార్ అండ్ రెస్టారెంట్‌లో సోమవారం సాయంత్రం ఒక్కసారిగా అగ్నిప్రమాదం సంభవించింది. బార్ అండ్ రెస్టారెంట్ కిచెన్ నుంచి బయటకు పొగ వెళ్లే చిమ్నిలో మంటలు చెలరేగి పక్కన ఉన్న వైర్లు అంటుకుని షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు వ్యాపించాయి. దీంతో బార్ అండ్ రెస్టారెంట్‌లో ఉన్న జనం భయంతో ఒక్కసారిగా కేకలు వేస్తూ బయటకు పరుగులు పెట్టారు. గమనించిన నిర్వాహకులు మంటలు ఆర్పివేయడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. నిర్వాహకులు వెంటనే స్పందించడంతో పెద్ద ప్రమాదం తప్పింది.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఇద్దరికి జైలు

సిద్దిపేట క్రైం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట పట్టణ పరిసర ప్రాంతంలో, రాజీవ్ రహదారిపై వన్ టౌన్, టూ టౌన్, ట్రాఫిక్ పోలీసులు కొన్ని రోజుల క్రితం నుంచి డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. 34 మంది మద్యం తాగి వాహనాలు నడుపుతుండగా పట్టుకున్నారు. వారిని సోమవారం సిద్దిపేట స్పెషల్ సెకండ్ క్లాస్ జ్యుడిషల్ మెజిస్ట్రేట్ కాంతారావు ఎదుట హాజరుపరచారు. విచారణ చేసి 34 మందికి రూ.49,500 జరిమానా, వారిలో ఒకరికి 11 రోజులు, మరో వ్యక్తికి మూడు రోజులు జైలు శిక్ష విధించారు.

44 మందికి జరిమానా

చేర్యాల, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : మద్యం తాగి వాహనాలు నడిపిన కేసులో 44 మందికి చేర్యాల జూనియర్ సివిల్ న్యాయాధికారి కృష్ణతేజ జరిమానా విధించారు. చేర్యాల సర్కిల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇటీవల నమోదైన డ్రంకెన్ డ్రైవ్ కేసులను విచారించారు. ఈ సందర్భంగా ఇద్దరికి రూ.3 వేలు, ముగ్గురికి రూ.2 వేలు, 39 మందికి వేయి రూపాయలు చొప్పున జరిమానా విధించారు.

కేసీఆర్‌ను కలిసిన మాజీ జడ్పీటీసీ



కేసీఆర్‌కు అరుణాచలం ప్రసాదాన్ని అందజేస్తున్న మాజీ జడ్పీటీసీ మల్లేశం

గజ్వేల్, మార్చి 3(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను గజ్వేల్ మాజీ జడ్పీటీసీ వంగ మల్లేశం మర్యాదపూర్వకంగా కలిశారు. మర్కుక్ మండలం ఎర్రవల్లిలోని ఆయన వ్యవసాయ క్షేత్రంలో సోమవారం కలిసి అరుణాచలం ప్రసాదాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మల్లేశం మాట్లాడుతూ త్వరలో జరుగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థుల గెలుపునకు సమన్వయంతో పనిచేయాలని సూచించినట్లు తెలిపారు.

ఎల్లమ్మ ఆలయానికి రూ.1.10 లక్షలు అందజేసిన చక్రధర్‌గౌడ్

నంగునూరు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : నంగునూరు మాల కమ్యూనిటీ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న రేణుక ఎల్లమ్మ ఆలయానికి కాంగ్రెస్ నాయకుడు గాధగోని చక్రధర్‌గౌడ్ రూ1.10 లక్షలను అందజేశారు. సోమవారం మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు శివగౌడ్ ఆధ్వర్యంలో చక్రధర్ గౌడ్ ఫౌండేషన్ తరఫున సంఘం ప్రతినిధులకు అందజేశారు. ఆలయ అభివృద్ధిలో భాగస్వాములు అవ్వడం పట్ల చక్రధర్‌గౌడ్‌కు సంఘం సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

కుకునూరుపల్లి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): బాల్యమిత్రుడు అనారోగ్యంతో మరణించడంతో స్నేహితులు ఆ కుటుంబానికి ఆర్థిక సహాయాన్ని అందించారు. తిప్పారం గ్రామానికి చెందిన బుర్ర రామాంజనేయులుగౌడ్ అనారోగ్యంతో మృతిచెందగా కుకునూరుపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో 1990-91వ సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసిన స్నేహితులు అందరూ కలిసి రూ.54,000 వేల ఆర్థిక సహాయాన్ని ఆ కుటుంబానికి అందజేశారు. భవిష్యత్తులో ఎటువంటి సహాయం అయినా ఆ కుటుంబానికి అందజేస్తామని భరోసా కల్పించారు.

కార్మికుడి కుటుంబానికి..

గజ్వేల్ రూరల్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్ మండలం రిమ్మనగూడ గ్రామానికి చెందిన మల్కాగళ్ల శివకుమార్ కేన్సర్‌తో బాధపడుతున్నాడు. రాజీ మైత్రి అసోసియేషన్ సభ్యులు వారి కుటుంబాన్ని పరామర్శించి సోమవారం ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మానవతావాదులు, ప్రభుత్వం ఈ కుటుంబాన్ని ఆదుకోవాలని, వారి పిల్లల చదువులకు ఆర్థిక తోడ్పాటు అందించాలని కోరారు.

కోనేరు పవిత్రతను పరరిక్షించాలి

కొమురవెల్లిలో బీఆర్ఎస్ నాయకుల నిరసన

చేర్యాల, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : కొమురవెల్లి మల్లన్న ఆలయ ప్రాంగణంలోని కోనేరును పరిరక్షించాలని, కోనేరును సుందరీకరించి భక్తులకు కలుషితనీటి బెడద తప్పించాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఆలయ కోనేరులో కలుషిత నీటిని పరిశీలించి నిరసన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నాయకులు ముత్యం నర్సింహులు, ఏర్పుల మహేశ్, కొండా శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండో పోటీల్లో సిద్దిపేట హవా

12 పతకాలను సాధించిన విద్యార్థులు

సిద్దిపేట కల్చరల్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లోని నిర్వహించిన 13వ ఓపెన్ స్టేట్ లెవెల్ ఇంటర్ స్కూల్స్ తైక్వాండో చాంపియన్‌షిప్‌లో సిద్దిపేట జిల్లా విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి 12 పతకాలను సాధించి సత్తా చాటారని తైక్వాండో జిల్లా కార్యదర్శి రాచకొండ శ్రీనివాస్ తెలిపారు. సబ్‌జూనియర్ విభాగంలో ప్రనిక్ష, సాత్విక్‌రెడ్డి, సుధామ్‌రెడ్డి, అవినాష్, విజయశ్రీ నరసింహ బంగారు పతకాలను అందుకున్నారు. జశ్వితశ్రీ, దీక్షిత, రోష్నితరెడ్డి, చైతన్య, హర్షవర్ధన్, హర్షిత్‌సాయి బ్రాంజ్ మెడల్ కైవసం చేసుకున్నారు. జూనియర్ విభాగంలో పృథ్వీరాజ్ సిల్వర్ మెడల్ సాధించారు.

జువాలజీ పుస్తకాల ఆవిష్కరణ

సిద్దిపేట కల్చరల్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : సిద్దిపేటకు చెందిన బండి శ్రీకాంత్ రచించిన జువాలజీ మేడ్ ఈజీ ఆక్వా కల్చర్, జువాలజీ మేడ్ ఈజీ సెరికల్చర్ పుస్తకాలను ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా. జీవన్ కుమార్ సోమవారం ఆవిష్కరించారు. కళాశాలలో ఈ పుస్తకాలను ఆవిష్కరించి లైబ్రరీకి అందించేయడం అభినందనీయమని ప్రిన్సిపాల్ అన్నారు.

నవోదయలో ప్రపంచ వినికిడి దినం



ర్యాలీ నిర్వహిస్తున్న నవోదయ విద్యార్థులు

వర్గల్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : వర్గల్ కేంద్రంలోని జవహర్ నవోదయ విద్యాలయంలో సోమవారం ప్రపంచ వినికిడి దినాన్ని ఘనంగా నిర్వహించారు. సిద్దిపేట జిల్లా మెడికల్, హెల్త్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం చెవి సంరక్షణపై తీసుకోవాలిసిన జాగ్రత్తలను విద్యార్థులకు సూచించారు. శబ్ద కాలుష్యాన్ని నివారించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నారాయణరావు, మండల వైద్యాధికారి హరిత, మీన, ప్రోగ్రాం కోఆర్డినేటర్‌లు రాజేందర్, వెంకటరమణ, విద్యాలయం ప్రిన్సిపాల్ రాజేందర్, వైస్ ప్రిన్సిపాల్ రమేశ్, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంటి సూరులో జెర్రిపోతు

● పట్టుకుని పట్టణ శివారులో విడిచిపెట్టిన కానిస్టేబుల్



చేర్యాలలో ఓ ఇంటి పైకప్పు కట్లెలలో నక్కిన పాము

చేర్యాల, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : ఎప్పుడు వచ్చిందో... ఎలా చేరుకుందో కానీ, చేర్యాల పట్టణంలోని భరత్‌నగర్ కాలనీకి చెందిన కొట్టె రాములు ఇంటి సూరు చిటారున జెర్రిపోతు సయ్యాటలాడింది. దీంతో కుటుంబసభ్యులు తీవ్రభయాందోళనకు గురయ్యారు. మెసిలిస్తే చూరుతొర్రలో దాచుకుని బయటకెలా వస్తుందోనని, తమపై ఎప్పుడుపడుతుందోనన్న భయంతో పరుగెత్తారు. పట్టణంలో పాములు పట్టేవారు లేకపోవడంతో ఆందోళన చెందుతున్న క్రమంలో అటుగా వెళుతున్న ఓ పోలీస్ కానిస్టేబుల్‌కు తెలపగా అతడు చాకచక్యతతో జెర్రిపోతును సురక్షితంగా పట్టుకుని పట్టణ శివారులోని ఖాళీ ప్రదేశంలో వదిలిపెట్టారు. దీంతో ఊపిరి పీల్చుకుని కానిస్టేబుల్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఐనాపూర్‌లో ఘనంగా బీరప్ప కల్యాణం

● పట్టువస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే పల్లా

చేర్యాల, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : కొమురవెల్లి మండలం ఐనాపూర్ గ్రామంలో కురుమసంఘం ఆధ్వర్యంలో సోమవారం బీరప్ప-కామరాతి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి హాజరయ్యారు. పట్టువస్త్రాలు సమర్పించి దేవతామూర్తులను దర్శించుకున్నారు. జనగామ నియోజకవర్గ ప్రజలు సుఖఃశాంతులతో జీవించాలని వేడుకున్నారు. అనంతరం కొమురవెల్లి మండలం పోసాన్‌పల్లి గ్రామంలో పర్యటించి ఓ మృతుడి కుటుంబాన్ని పరామర్శించి రూ.5వేలు ఆర్థికసహాయం అందజేశారు.

గాగిళ్లాపూర్ శివాలయంలో పూజలు

మద్దూరు, మార్చి 3(ఆంధ్రజ్యోతి) : మండలంలోని గాగిళ్లాపూర్ శివాలయం ఏడో వార్షికోత్సవం వైభవంగా నిర్వహిస్తుండగా సోమవారం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి హాజరై ఆలయంలో ప్రత్యేక పూజలను చేశారు. ఆలయంలో ధ్వజస్తంభ సుబ్రమణ్య నాగప్రతిష్ఠాపన, శివపార్వతుల కల్యాణోత్సవం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సాగునీరు రావాలని, రైతన్నలు పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని దేవుడిని ప్రార్థించినట్లు తెలిపారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మేక సంతోష్, బొల్లు చంద్రమౌళి తదితరులు ఉన్నారు.



మద్దూరు : గాగిళ్లాపూర్‌లో శివాలయం వార్షికోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

మల్లన్నకు ముడుపు కట్టి.. కొమ్మూరికి ఎమ్మెల్సీ రావాలని వేడుకోలు

చేర్యాల, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డికి ఎమ్మెల్సీ పదవిరావాలని చేర్యాల పట్టణ, మండల కమిటీ నాయకులు సోమవారం కొమురవెల్లి మల్లన్నస్వామికి ముడుపు కట్టారు. మల్లన్నను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి గంగిరేగుచెట్టుకు ముడుపుకట్టి వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షుడు కొమ్ము రవి, పట్టణాధ్యక్షుడు దాసరి శ్రీకాంత్, జిల్లా నాయకుడు పుర్మ ఆగంరెడ్డి, పలువురు నాయకులు పాల్గొన్నారు.



మల్లన్న ఆలయంలో ముడుపుతో పూజలు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్‌ను కలిసిన కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి



చేర్యాల, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్‌ను జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి సోమవారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా పార్టీ కార్యక్రమాలు, జనగామ నియోజకవర్గ రాజకీయ పరిస్థితులపై చర్చించారు.

మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం కృషి

● మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి

కొండపాక/కుకునూరుపల్లి/గజ్వేల్ రూరల్/వర్గల్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తుందని మాజీ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు తూముకుంట నర్సారెడ్డి అన్నారు. సోమవారం ఆయన గజ్వేల్ నియోజకవర్గ పరిధిలో విస్తృతంగా పర్యటించారు. కొండపాక మండలం మర్పడగలో, కుకునూరుపల్లి మండలంలోని లకుడారం, మెదినీపూర్, మాత్‌పల్లి గ్రామాలలో పలు వీధుల్లో సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల అభ్యున్నతి ధ్యేయంగా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. గజ్వేల్ మండలం బెజగామ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ ఎంపీటీసీ నకీర్త గంగాధర్ ఆధ్వర్యంలో తయారుచేయించిన 50 డప్పులను సోమవారం తూంకుంట నర్సారెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేయాలని, త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. వర్గల్ మండల కేంద్రంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో రేణుక ఎల్లమ్మ తల్లి ఉత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమైనాయి. గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి హాజరై, ఆలయంలో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. గౌడ సంఘం నాయకులు ఆయనను సన్మానించారు.



కుకునూరుపల్లి : సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న తూంకుంట నర్సారెడ్డి

కాలువల నిర్మాణం పూర్తిచేసి సాగునీరు అందించాలి

కొండపాక , మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : మల్లన్నసాగర్ నుంచి కొండపాక మండలం రాంపల్లి, బందారం, అంకిరెడ్డిపల్లి, దర్గా గ్రామాలకు కాలువలను నిర్మించి సాగునీరు ఇవ్వాలని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూముకుంట నర్సారెడ్డి అధికారులను కోరారు. సోమవారం అదనపు కలెక్టర్ అబ్దుల్‌హమీద్‌కు ఆయన వినతిపత్రాన్ని అందజేశారు. మల్లన్నసాగర్ నుంచి తపాస్‌పల్లి రిజర్వాయర్‌కు అండర్‌గ్రౌండ్ కాలువను త్వరలో పూర్తిచేసి భూములు కోల్పోయిన వారికి పరిహారం ఇప్పించాలన్నారు. ఆయన వెంట డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి, భూమిరెడ్డి, మాజీ సర్పంచ్ వాసర లింగారావు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

● జిల్లా న్యాయాధికారి స్వాతిరెడ్డి



మాట్లాడుతున్న న్యాయాధికారి స్వాతిరెడ్డి

సిద్దిపేట క్రైం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఈనెల 8న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు, కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రెటరీ, న్యాయాధికారి స్వాతి రెడ్డి తెలిపారు. సిద్దిపేట కోర్టు భవనంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో స్వాతిరెడ్డి మాట్లాడుతూ రాజీపడదగిన కేసుల్లో కక్షిదారులు లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు. గత లోక్ అదాలత్‌లో ఐదు వేల కేసుల వరకు పరిష్కరించబడినట్లు తెలిపారు.

నాణ్యమైన భోజనం అందించాలి

● డీఈవో శ్రీనివాస్‌రెడ్డి



రికార్డులను పరిశీలిస్తున్న డీఈవో శ్రీనివాస్‌రెడ్డి

రాయపోల్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు పాఠశాలల్లో నాణ్యమైన భోజనాన్ని అందించాలని సిద్దిపేట జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆయన రాయపోల్ మండలం ఆరెపల్లి ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేశారు. తరగతి గదిలోకి వెళ్లి పిల్లల సామర్థ్యాలను, వర్క్‌షీట్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ ఉపాధ్యాయులు ప్రతీరోజు భోజనం తనిఖీ చేయడంతో పాటు వంట పాత్రలను పరిశీలించాలని సూచించారు. వెనుకబడిన విద్యార్థులకు తగిన సమయం కేటాయించాలని పేర్కొన్నారు.

అక్కారం పంప్‌హౌజ్‌ను ప్రారంభించి సాగునీరు ఇవ్వాలి

ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి



శ్రీగిరిపల్లి పంప్‌హౌజ్ వద్ద కాళేశ్వరం కాలువను పరిశీలిస్తున్న ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్, మార్చి 3(ఆంధ్రజ్యోతి) : గజ్వేల్ మండలం అక్కారం పంప్‌హౌజ్‌ను వెంటనే ప్రారంభించి పరిసర ప్రాంతాల రైతాంగానికి సాగునీటిని విడుదల చేయాలని బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి డిమాండ్ చేశారు. గజ్వేల్ పట్టణంలోని అక్కారం-శ్రీగిరిపల్లి వద్ద కాళేశ్వరం కాలువను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వంటేరు ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ అక్కారం పంప్‌హౌజ్‌ను వెంటనే ప్రారంభించి శ్రీగిరిపల్లి, అంగడికిష్టాపూర్, గణేశ్‌పల్లి, చేబర్తి, అక్కారం రైతులకు సాగునీటిని అందించాలన్నారు. తపాస్‌పల్లి రిజర్వాయర్ నుంచి నీటిని విడుదల చేసి కొండపాక మండల రైతులకు సాగునీటిని అందజేయాలన్నారు. గత బీఆర్ఎస్ పాలనలో ఎండాకాలంలో నిండుకుండల్లా కాలువలు ఉండేవని నేడు ఎడారిగా మారిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులను ఎన్నిసార్లు కలిసినా, ఫోన్లు చేసినా స్పందించడం లేదని రైతులు వాపోతున్నారని మండిపడ్డారు. ఆయన వెంట శ్రీగిరిపల్లి మాజీ సర్పంచ్ చంద్రమోహన్‌రెడ్డి, సత్యనారాయణ తదితరులున్నారు.

ట్యాంకర్లు తెప్పించి.. ఇంటింటికీ నీటి సరఫరా

అన్నసాగర్‌లో కాంగ్రెస్ నాయకుల సేవ

ములుగు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్నసాగర్ గ్రామంలో మిషన్‌భగీరథ నీళ్లు గ్రామస్థులకు సరిపోను రావడం లేదు. మాజీ సర్పంచ్ మహిపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు శంకర్‌రెడ్డి, జగదీశ్‌రెడ్డి సొంత ఖర్చులతో నీళ్ల ట్యాంకర్లు ఏర్పాటు చేసి ఇంటింటికీ నీళ్లను అందిస్తున్నారు. వారు చేస్తున్న సేవలను గ్రామస్థులు అభినందిస్తున్నారు.



అన్నసాగర్‌లో నీటి సరఫరా చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఎండిన పంటలకు ఎకరాకు రూ.50 వేల నష్టపరిహారం అందించాలి

● సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి

చేర్యాల, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : చేర్యాల, కొమురవెల్లి మండలాల్లో ఎండిపోయిన వరి పంటలకు ఎకరాకు రూ.50 వేలు చొప్పున నష్టపరిహారం అందించి రైతాంగాన్ని ఆదుకోవాలని సీపీఎం సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి కోరారు. కొమురవెల్లి మండలం లెనిన్‌నగర్ గ్రామంలో ఎండిపోయిన వరి పొలాలను సోమవారం సీపీఎం నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేర్యాల ప్రాంతంలో కరువును పారదోలేందుకే తపాస్‌పల్లి రిజర్వాయర్‌ను నిర్మించారన్నారు. సకాలంలో చెరువులు, కుంటలను నింపకపోవడంతోపాటు భూగర్భ జలాల అడుగంటి పంటలు ఎండిపోతున్నాయన్నారు. ప్రభుత్వానికి ముందుచూపు లేకపోవడంతో తీవ్రంగా నష్టపోయారని మండిపడ్డారు. ఆయన వెంట నాయకులు తాడూరి రవీందర్, దాసరి ప్రశాంత్, చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాద బాధితులకు మెరుగైన చికిత్స అందించాలి

● బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్

సిద్దిపేట రూరల్,మార్చి 3(ఆంధ్రజ్యోతి) : కుంభమేళాకు వెళ్లి తిరిగి వస్తూ ప్రమాదానికి గురైన బాధితులకు మెరుగైన చికిత్స అందించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ వైద్యులను కోరారు. సిద్దిపేట రూరల్ మండలం మాచాపూర్ గ్రామస్థులు ప్రయాణిస్తున్న కారు మధ్యప్రదేశ్‌లో ప్రమాదానికి గురై తీవ్ర గాయాలై ఆర్‌వీఎం ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా వారిని పరామర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం వారిని ఆదుకోవాలన్నారు. ఆయన వెంట బీజేపీ మండల అధ్యక్షుడు అన్నసారం సురేష్‌గౌడ్, జిల్లా నాయకులు ఉన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు : దేవులపల్లి

నంగునూరు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : అర్హులందరికీ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు అందజేస్తుందని టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి దేవులపల్లి యాదగిరి అన్నారు. నంగునూరు మండలం నాగరాజుపల్లిలో సోమవారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ముగ్గు పోశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదోడి సొంతింటి కలను నిజం చేసేందుకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని తెలిపారు. గ్రామంలో ఇళ్లు లేని వారికి వందశాతం మంజూరు చేస్తామన్నారు. పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి నిర్మించి ఇవ్వడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు వెళుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రాగుల కృష్ణ, చేర్యాల బాలయ్య, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

స్వయం పాలన దినోత్సవం

మర్కుక్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మర్కుక్ మండలం జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల చేబర్తిలో సోమవారం స్వయంపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులు ఒకరోజు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు శంకర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చక్కని ప్రదర్శన చేశారని అన్నారు.

పిల్లిట్ల కిష్టయ్యకు ఉగాది విశ్వశాంతి పురస్కారం

సిద్దిపేట అర్బన్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : చిందు యక్షగాన కళారంగంలో అందిస్తున్న విశిష్ట సేవలకుగానూ మందపల్లి గ్రామానికి చెందిన పిల్లిట్ల కిష్టయ్యకు జాతీయస్థాయి ఉగాది విశ్వశాంతి పురస్కారం వరించింది. ఆదివారం హైదరాబాద్ రవీంద్రభారతిలో అరణ్య సకల కళా వేదికపై దుడపాక శ్రీధర్ నుంచి పురస్కారాన్ని అందుకున్నారు.

తర్పణం కవితకు ద్వితీయ బహుమతి

సిద్దిపేట అర్బన్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేటకు చెందిన వెన్నెల సాహితీ సంఘం ప్రధాన కార్యదర్శి పర్కపెల్లి యాదగిరి రచించిన తర్పణం కవితకు వచన కవితా పోటీల్లో ద్వితీయ బహుమతి లభించింది. ప్రపంచ కవితా దినోత్సవం సందర్భంగా నెల్లూరుకు చెందిన సంధ్య యానాం, చిన్ని నారాయణరావు ఫౌండేషన్ వారు సంయుక్తంగా నిర్వహించిన వచన కవితల పోటీలో ఈ బహుమతిని ప్రకటించారు.

ఆర్చరీలో బంగారు పతకం



బంగారు పతకంతో రశ్మితరెడ్డి

సిద్దిపేట కల్చరల్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి కొల్లాపూర్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్లో నిర్వహించిన జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ ఆర్చరీ చాంపియన్‌షిప్-2025 పోటీలలో సిద్దిపేటకు చెందిన చిరుకోటి రశ్మితరెడ్డి రెండోసారి ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకాన్ని సాధించింది. 31 మంది క్రీడాకారులతో పోటీ పడిన రశ్మితరెడ్డి మొదటి స్థానంలో నిలిచి బంగారు పతకాన్ని సాధించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తతో ఉండాలి : ఎస్ఐ

మద్దూరు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ షేక్ మహబూబ్ తెలిపారు. సోమవారం మండలంలోని ధర్మారం గ్రామంలో ఆయన పర్యటించారు. గ్రామస్థులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మహబూబ్ మాట్లాడుతూ గంజాయి, మత్తు పదార్థాలు జోలికి వెళ్లి జీవితాలను ఆగం చేసుకోవద్దన్నారు. ఎవరైనా చట్ట వ్యతిరేక పనులకు పాల్పడినా, అనుమానాస్పదంగా కన్పించినా 100 కాల్ చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు.

పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి

● మండల విద్యాధికారి గజ్జల కనకరాజు

దౌల్తాబాద్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): పదో తరగతిలో 10 జీపీఏ సాధించి ఉత్తమ ఫలితాలను తీసుకురావాలని ఎంఈవో గజ్జల కనకరాజు సూచించారు. దౌల్తాబాద్ మండల కేంద్రంలోని బాలికల జడ్పీ పాఠశాలలో సోమవారం పదో తరగతి విద్యార్థులకు నిర్వహించిన వీడ్కోలు సభలో పాల్గొని మాట్లాడారు.

వరి రైతులపై 'మొగి' పిడుగు

5వ పేజీ తరువాయి..

కిలోల చొప్పున చల్లుకోవాలి. లేదా కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 0.5 మిల్లీలీటర్ల మందును లీటర్ నీటికి కలిపి ఎకరాకు 200లీటర్ల ద్రావణాన్ని పిచికారి చేయాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. సల్ఫైడ్ ధాతువు లోపాన్ని గమనిస్తే వెంటనే నీటిని తొలగించి, పొలాన్ని ఆరబెట్టాలని, తడి, పొడి పద్ధతిలో నీటి తడులు వేసుకోవాలని, మల్టీ-కే లేదా స్వర్ణపాల్ లేదా 19.19.19 మోదుగు ఎరువుల పోషకాలను పైపాటిగా పిచికారి చేసుకోవాలని సూచిస్తున్నారు. 15 రోజుల తర్వాత పలుచగా ఎకరాకు 20 కిలోల యూరియాను చల్లుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

విచ్చలవిడిగా ఎరువుల వినియోగం

అధికారులు అవగాహన కల్పించడంలో విఫలమవడంతో రైతులు విచ్చలవిడిగా పురుగు మందులు, ఎరువులను వాడుతూ భారీగా పెట్టుబడులను పెడుతున్నారు. జిల్లా వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో అవగాహన ఏర్పాట్లు లేకపోవడంతో రైతులు పురుగు మందుల డీలర్లు ఇచ్చిన మందులు, ఎరువులను విచ్చలవిడిగా వాడుతూ నష్టపోతున్నారు. పురుగుమందులు, ఎరువులు వేసిన ప్రయోజనం లేకపోవడంతో ఆందోళనకు గురవుతున్నారు. అధికారులు పటిష్ట ప్రణాళికతో రైతులకు అవగాహన సదస్సుల ద్వారా వివరించాలని పలువురు రైతులు కోరుతున్నారు.

రెండు ఎకరాలు నష్టపోయా

వరిలో మొగి పురుగు సోకడంతో రెండెకరాల పంట నష్టపోయా. నెల క్రితం దాదాపుగా రూ.50వేలు పెట్టుబడి పెట్టి వరి నాటు వేశా. ఇటీవలే మొగిపురుగు ఆశించడంతో అక్కడక్కడా గుంపులు గుంపులుగా వరి ఎర్రగా మారి కుళ్లిపోతుంది. ఎన్ని పురుగు మందులు కొట్టినా, గుళికలు చల్లినా ప్రయోజనం లేదు.

- తలారి వెంకటేశ్, పిడిచెడ్, గజ్వేల్ మండలం

రైతులకు అవగాహన కల్పిస్తున్నాం

మొగి పురుగు నివారణకు గ్రామస్థాయిలో రైతులకు ఏఈవోలతో అవగాహన కల్పిస్తున్నాం. రైతులు అధికారులను సూచనలు తప్పకుండా పాటించాలి.

- నాగరాజు, గజ్వేల్ వ్యవసాయాధికారి